క్లుప్తంగా

గోశాలకు 50 ట్రక్కుల వరిగడ్డి వితరణ



వరిగడ్డి ట్రాక్టర్ల వద్ద దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం గోశాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు చల్లగుండ్ల నరసింహారావు శుక్రవారం 50 ట్రక్కుల వరిగడ్డిని వితరణగా అందించగా.. మంత్రి తనయుడు యుగంధర్ పాల్గొన్నారు. మూగ జీవాల ఆకలి తీర్చడానికి దాతలు గ్రాసం అందించినట్లు దాతలు తెలిపారు. ఈమేరకు మూగజీవాలకు పశుగ్రాసం అందించడం అభినందనీయమని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి సమావేశాన్ని జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: ఖమ్మం రూరల్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నేడు(శనివారం) నిర్వహించే పాలేరు స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల కన్వీనర్ చావా శివ రామకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి హాజరవుతారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశానికి అధిక సంఖ్యలో సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రూరల్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు శుక్రవారం మార్చారు. గతంలో నగరంలోని రాపర్తినగర్‌లో కార్యాలయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు రూరల్‌కు మార్చారు. దీంతో మండలానికి సంబంధించిన భూమి, ఇతర లావాదేవీలు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలోనే జరగనున్నాయి.

దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సంఘ పెద్దలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో యాదవ్ సంఘం ఆధ్వర్యాన నిర్మించనున్న శ్రీగంగమ్మ తల్లి, పోతురాజు స్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం సంఘ పెద్దలు శంకుస్థాపన చేశారు. ఈమేరకు దేవాలయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలని నిర్వహణ కమిటీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు2
సాయిరాం	రత్నం
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

\- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	5
వంకాయ	22		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	46		10
కాకర	40	చుక్కకూర	2
బీర	50		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	86	గోంగూర	2
గోరుచిక్కుడు	30		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	44		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	60		20

\-ఖమ్మం వ్యవసాయం

25 రోజులు.. రూ.6.30 కోట్లు!





పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, ఆర్ఓ

'ఎర్లీ బర్డ్' ద్వారా వసూలైన ఆస్తి పన్నులు

- పన్నుల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికలు
- ఈ వారంలో అధిక రాబడి వస్తుందని అధికారుల అంచనా
- వసూళ్లకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు
- అధిక మొత్తంలో చెల్లించే వారు 30లోగా కట్టాలని నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డుస్థాయిలో పన్నులు వసూలు చేయగా.. ఈ ఏడాది కూడా అంతకు మించి పన్నులు వసూలు చేయాలని నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండే ప్రణాళిక ప్రకారం ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వ ఎర్లీబర్డ్ స్కీం ప్రకటించగా.. ఏప్రిల్‌లోనే అధిక మొత్తంలో పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎర్లీ బర్డ్ స్కీంలో రూ.8.60 కోట్లు పన్నులు వసూలు చేయగా, ఈ ఏడాది రూ.10 కోట్లకు పైగా పన్నులు వసూలు చేసేలా కార్యాచరణ రూపొందించారు.

ప్రజలకు అవగాహన..

2024–25 కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ప్రారంభం కాగా, ఈ ఏడాది ఆస్తి పన్ను వసూళ్లను రెండు సమ భాగాలుగా విభజించారు. మొదటి అర్ధ వార్షిక సంవత్సరం జూన్ నెలాఖరు వరకు, రెండో అర్ధ వార్షిక సంవత్సరం డిసెంబర్ నెలాఖరు వరకు పరిగణలోకి తీసుకుంటారు. ఇంటి యజమాని చెల్లించాల్సిన పన్నును ఆ గడువులోగా చెల్లించాల్సి ఉంటుంది. గడువు దాటితే పన్నుపై పెనాల్టీ విధిస్తారు. అపరాధ రుసుము లేకుండా గడువులోగా పన్నులు చెల్లించాలని అధికారులు మరోసారి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక అధిక మొత్తంలో పన్ను చెల్లింపుదారులను ప్రత్యేకంగా కలిసి పన్నుల చెల్లించాలని సూచిస్తున్నారు.

రూ.6.30 కోట్ల ఆదాయం..

ఏప్రిల్‌లో ఇచ్చిన ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగపరుస్తూ కేఎంసీ అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు. ఆర్ఐలు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరంలో పన్నుల వసూళ్లకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 25 నాటికి 10,821 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.6.30 కోట్లు వసూలు చేశారు. వీటితో పాటు పంపు పన్నులు, ట్రేడ్ లైసెన్సుల ద్వారా పన్నులను వసూలు చేస్తున్నారు. ఎర్లీ బర్డ్ స్కీంకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉండడంతో మరో రూ.4 కోట్లకు పైగా వసూలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇక శ్రీనివాసనగర్, గాంధీ చౌక్, పంపింగ్‌వెల్ రోడ్డు, ముస్తాఫనగర్, టీడీపీ ఆఫీసర్ దగ్గర, బుర్హాన్‌పురం ప్రాంతాల్లో పన్నుల వసూళ్లకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.

1,974 మందికి నోటీసులు..



ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు కేఎంసీ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. ఎర్లీబర్డ్ స్కీంకు అర్హత ఉన్నవారిని గుర్తించి వీటిని అందజేస్తున్నారు. అధికమొత్తంలో పన్నులు చెల్లించే 1,974 మందికి నోటీసులు జారీ చేశారు. ఇక షాపింగ్‌మాల్స్, విద్యాసంస్థలు, హోటళ్లు, ఆస్పత్రులపై దృష్టి సారించి, వారిని ప్రత్యేకంగా కలిసి పన్నులు వసూలు చేస్తున్నారు. పన్ను చెల్లింపుదారులకు మెసేజ్‌లు పంపించడంతో పాటు ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారు.

ఘనంగా ఆలయాల ప్రతిష్ఠా వేడుకలు

పూజల్లో పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి



రాంక్యాతండా పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల



ఖమ్మంరూరల్: పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన రఘురాంరెడ్డి

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: నగరంలోని పుట్టకోట, రఘునాథపాలెం మండలంలోని రాంక్యాతండా గ్రామాల్లోని దేవాలయాల్లో శుక్రవారం ప్రతిష్ఠా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యాన పుట్టకోటలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొనగా, రాంక్యాతండాలో బోడ్రాయి, సీతారామచంద్రదేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠా వేడుకల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యాన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావూరి కరుణసైదబాబు, మల్లీదు జగన్, మల్లీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళీ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావీద్, షేక్ అఫ్జల్, తేజావత్ వెంకన్న, తారాచంద్ తదితరులతో పాటు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొంగులేటి, రఘురాంరెడ్డి పర్యటన..

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఖమ్మంరూరల్ మండలంలోని పోలిశెట్టిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి, ధాక్యాతండాలో శ్రీసీతారామచంద్రస్వామి ప్రాణప్రతిష్ఠ వేడుకలు, కూసుమంచి మండలం మల్లేమల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీసీతారామ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం, గంగమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు జరిగాయి. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేద మంత్రాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, వీరారెడ్డి, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన మాధవరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం గ్రెయిన్ మార్కెట్ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు నున్నా మాధవరావు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడిగా ఉన్న మాధవరావు సోమవారం మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు కార్మిక వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు, చావా నారాయణరావు, నల్లమల ఆనంద్, తల్లాడ రమేష్, దిరిశాల వెంకటేశ్వర్లు, నల్లమోతు లక్ష్మయ్య తదితరులున్నారు.

సొంతగూటికి చేరిన జెడ్పీటీసీ

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీలో గతంలో పనిచేసి ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ బాట పడుతున్నారు. శుక్రవారం కామేపల్లి జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్, బర్లగూడెం ఎంపీటీసీ మాలోత్ శంకర్ నాయక్ గాంధీభవన్‌లో చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జగ్గారెడ్డి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డికి జెడ్పీటీసీ సన్నిహిత్యంగా ఉండడం, పార్టీ బలోపేతం కోసం కష్టపడిన ప్రజాప్రతినిధిగా గుర్తింపుతో కాంగ్రెస్ పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో చేరిక జరిగినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



తిరుమలాయపాలెం: బచ్చోడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేయగా, ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు సూచించారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో, నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, వారానికోసారి మస్టర్ పే స్లిప్పులు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని హన్మంతరావు డిమాండ్ చేయగా.. పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నందున కూలీలు ఉదయం 6 గంటలకే పని వద్దకు చేరుకొని వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వీరబాబు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కుమ్మరి నాగమణి, పంచాయతీ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్, సహాయకులు వడ్లమూడి శ్రీనివాసరావు, మేట్‌లు, కర్ల బాలస్వామి, తిరపయ్య, పి.మాధవి, వెంకటరమణ, నాయకులు పిచ్చయ్య, లింగయ్య, సోమమ్మ, నాగమణి, రమాదేవి, ఉప్పమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్, బీజేపీ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, అత్త నీలగిరి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరంలోని 26వ డివిజన్‌లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర నిధుల ద్వారా జిల్లా అభివృద్ధికి పాటుపడే తాండ్ర వినోద్‌రావుకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మారుతి, శేషఫణికుమార్‌శర్మ, పాపనిమని, ములుగు దివ్య, మరికంటి శేషమని, మార్తి విశాలి, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు

పార్టీని కాదు.. వ్యక్తిని చూసి ఓటేయండి



మాట్లాడుతున్న మద్దిశెట్టి అజయ్‌బాబు

ఖమ్మం మామిళ్లగూడెం: కులం, మతం, ప్రాంతీయ పేరుతో చేసే పార్టీలు పార్టీలే కాదని, ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ పార్టీని చూసి కాకుండా వ్యక్తిని చూసి ఓటేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర సమన్వయ కర్త, ఖమ్మం ఎంపీగా పోటీ చేస్తున్న మద్దిశెట్టి అజయ్‌బాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఓట్లు వేయడానికి పనికి రారా అని, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని చెప్పారు. క్రిస్టియన్లు, ముస్లింలకు ఓట్లు రద్దు చేస్తామని, రిజర్వేషన్ తీసేస్తామని చెబుతున్న మోదీ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీఎండీఎఫ్ నేత వేములపల్లి తిమోతి, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు మట్టి తిమోతి, టీవైజేఏసీ నేత స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

బోన్ మ్యారో సర్జరీతో తలసేమియాకు చెక్

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు బోన్ మ్యారో సర్జరీతో ఉపశమనం కలిగించవచ్చని ప్రముఖ వైద్యులు ఎం.విజయ్, డి.నారాయణమూర్తి అన్నారు. తలసేమియాతో బాధపడుతున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన జి.వీక్షిత్ (హెచ్ఎల్ఏ హాఫ్ మ్యాచ్), ఖమ్మంకు చెందిన జె.ఝాన్సీ(హెచ్ఎల్ఏ ఫుల్ మ్యాచ్) చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స విజయవంతమై ఖమ్మంకు తిరిగి రాగా.. వారికి సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు శుక్రవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యుడు రవిచందర్ మాట్లాడుతూ.. బెంగుళూర్ సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఇప్పటివరకు తమ సంస్థ ఆధ్వర్యాన 8 మంది చిన్నారులకు విజయవంతంగా చికిత్స చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్‌.ఉపేందర్, తలసేమియా చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులతో సంస్థ బాధ్యులు

'పెవిలియన్'పై పట్టింపేది?

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన గ్రౌండ్



ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా కేంద్రంలో క్రీడలకు పుట్టినిల్లుగా వెలుగొందిన పెవిలియన్ గ్రౌండ్ ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా వస్తున్న కొందరు యువతీ యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో వాకింగ్‌కు వస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా సాయంత్రం 6 గంటల తర్వాత వస్తున్న జంటల తీరుతో ఇక్కట్లు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇంకొందరు గ్రౌండ్‌లో మద్యం సేవిస్తున్నారని తెలుస్తోంది. అయితే, గ్రౌండ్‌ను పర్యవేక్షించాల్సిన ఖమ్మం కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోకపోగా.. పోలీసులు సైతం ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయని విమర్శిస్తున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మంగీలాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

30లోగా పోలింగ్ స్లిప్పులు అందించాలి



పోలింగ్ స్లిప్పులు అందిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్లిప్పులను ఈ నెల 30 లోగా ఓటర్లకు అందించాలని మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని మంగాపురంతండాలో పోలింగ్ స్లిప్పులను ఇంటింటా పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పోలింగ్ స్లిప్పుల పంపిణీ చేయాలని, జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌ఓతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేసుల నుంచి తప్పించుకోవడానికే చేరికలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4, 5వ డివిజన్లకు చెందిన కొందరు కేసులు నుంచి తప్పించుకోవడానికే కాంగ్రెస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని 4వ డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం ఆరోపించారు. పార్టీ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్, పలువురు నాయకులు మాట్లాడుతూ.. స్థానిక నాయకులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలిస్తే చేరికలను అడ్డుకుంటారనే భయంతో దొంగ చాటుగా ఎన్నికల ప్రచారంలో జిల్లా అధ్యక్షుడి ద్వారా కండువా కప్పించుకోవడం గర్హనీయమన్నారు. వీరిని చేర్చుకోవడం వల్ల నష్టమే తప్ప లాభం ఉండదని తాము పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పల్లెబోయిన చంద్రం, బొందిల నాగేంద్రసింగ్, తమ్మినేని వెంకటేశ్వర్లు, నామ లక్ష్మయ్య. బంధి వెంకన్న, షరీఫ్, విజయకుమారి, కృష్ణ, రామకృష్ణ, దానయ్య, సురేష్, రామకృష్ణ,రాము, రాజు పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేస్తున్న మోదీ'



రఘురాంరెడ్డికి డప్పు అందిస్తున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాదిగలను మోసం చేస్తున్న మోదీని గద్దెదింపాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. శుక్రవారం ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆయన విజయాన్ని కాంక్షిస్తూ దండోరా డప్పును బహూకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం అభ్యర్థితో దండోరా వేయించి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుప్పలి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, కిరణ్, ప్రకాశ్‌బాబు, వీరస్వామి, భరత్, వెంకయ్యబాబు, కాటమయ్య, గురవయ్య, వెంకన్న, చిన్న భద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఖమ్మంమయూరిసెంటర్: పెరిగిన ఎండలతో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతీ రోజు మంచినీటి సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సలాం అన్నారు. శుక్రవారం స్థానిక రేవతి సెంటర్‌లో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండల నుంచి ప్రజలు రక్షించుకునేందుకు కూడళ్లు, పారిశ్రామిక ప్రాంతాలు, కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మంచినీటి సరఫరాతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ రెహమాన్, యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నరసింహారావు, ఎస్‌కె.చానా, డి.శేఖర్ నాయక్, కె.పిచ్చయ్య, పాండు, దుర్గా, పాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాల ఫ్లాగ్‌మార్చ్

ఖమ్మంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండలంలోని చింతగుర్తి, రఘునాథపాలెం, ఈర్లపుడి గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలలో 'పూల'కరింత..

భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.. ఎండ వేడిమికి చెట్ల ఆకులు వడలిపోయి.. పూలు వాడిపోయి.. కొమ్మల్లో తేమ పోయి.. కళావిహీనంగా కనిపిస్తున్నాయి.. కానీ, ఒక చెట్టు మాత్రం మండుతున్న వేడిలోనూ మైమరిపిస్తోంది.. కళ్లు బైర్లు కమ్మే ఎండలోనూ కళకళలాడుతోంది.. పసుపు పచ్చని పూలతో చూపరులను పలకరిస్తోంది.. సుందరయ్యనగర్‌లోని గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన సుందరయ్యపార్కులో ఈ కనువిందుచేసే చెట్టు ఉంది. వాకింగ్‌కు వచ్చిన పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రచండ భానుడి ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో అనేక చెట్లు ఆకులు రాలి కళావిహీనంగా కనిపిస్తుండగా ఈ చెట్టు మాత్రం మెరుస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. -ఖమ్మంవైద్యవిభాగం

